సాక్షి
ప్రకాశం
గురువారం । 21 । నవంబర్ । 2024

జిల్లా స్థాయి షూటింగ్ బాల్ జట్లు ఎంపిక



సంతనూతలపాడు: ప్రకాశం జిల్లా స్థాయి షూటింగ్ బాల్ జూనియర్, సబ్ జూనియర్ బాలబాలికల జట్లను పేర్నమిట్ట జిల్లా పరిషత్ హైస్కూల్లో బుధవారం ఎంపిక చేశారు. వివిధ గ్రామాల నుంచి దాదాపు 60 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జూనియర్ విభాగంలో 12మంది బాలురు, 12 మంది బాలికలు, సబ్ జూనియర్ విభాగంలోనూ 12 మంది బాలురు, 12 మంది బాలికలను ఎంపిక చేశారు. ఈ జట్లు అనంతపురం జిల్లాలో జరిగే 43వ రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీల్లో ప్రకాశం జిల్లా తరపున పాల్గొంటాయని ప్రకాశం జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ నారాయణరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పార్వతిశాంతి, సీనియర్ ఉపాధ్యాయులు ఫణీంద్ర కుమార్, గాంధ్ల ప్రతాప్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.రత్నకుమార్ పాల్గొన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32/22

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కుంట స్థలంలో హద్దురాళ్ల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

సింగరాయకొండ: మండలంలోని సోమరాజుపల్లి పంచాయతీ బకరాల గుంట స్థలం ఆక్రమణపై ఈనెల 18వ తేదీ సోమవారం 'కుంటను మింగిన ఘనులు' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. కోట్లాది రూపాయల విలువైన బకరాల గుంటకు చెందిన సుమారు 3 ఎకరాల స్థలాన్ని అక్రమార్కులు కబ్జా చేసేందుకు ప్రయత్నించి అందులో ఒక్కొక్కటి 2.50 సెంటు చొప్పున 60 ప్లాట్లు వేశారు. దీనిపై ప్రచురితమైన కథనానికి స్పందించిన రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో ఉన్న హద్దురాళ్లను పూర్తిగా తొలగించారు.


పోలీసు కానిస్టేబుల్ పై దాడి

ఒంగోలు టౌన్: మద్యం మత్తులో ఉన్న తెలుగుదేశం పార్టీ నాయకుడు ఒకరు పోలీసు కానిస్టేబుల్ పై దాడి చేసి కొట్టడం సంచలనం సృష్టించింది. పోలీసుల కథనం ప్రకారం... తాలూకా పోలీసు స్టేషన్లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు పై స్థానిక శివ ప్రసాద్ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు, కార్ ట్రావెల్స్ యజమాని బోడపాటి రాంబాబు అసభ్యంగా తిడుతూ దాడికి పాల్పడ్డాడు. కానిస్టేబుల్ శ్రీనివాసరావు ముంగమూరు రోడ్డులో ఇండియన్ గ్యాస్ మూలమీద ఉన్న ఒక కాకా హోటల్లో మంగళవారం రాత్రి టిఫిన్ చేస్తున్నాడు. అతడి మోటారు బైకును రోడ్డు పక్కన నిలబెట్టాడు. అప్పుడే అటుగా కారులో వెళుతున్న రాంబాబు రోడ్డుకు అడ్డంగా ఉన్న బైకును తీయమన్నాడు. టిఫిన్ చేస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాసరావు లేచి వెళ్లి బైకును తీశాడు. అంతటితో సంతృప్తి చెందని రాంబాబు ''ఏరా.. ఈ రోడ్డు నీ అబ్బ సొమ్మనుకున్నావా నా..'' అంటూ తిట్టడం మొదలెట్టాడు. కారు దిగి వచ్చి కానిస్టేబుల్ మీద దాడికి దిగాడు. ఇష్టం వచ్చినట్టు కొట్టాడు. దాడి చేస్తున్న రాంబాబును కానిస్టేబుల్ శ్రీనివాసరావు పట్టుకోగా అతడి చేతిని కొరికాడు. కానిస్టేబుల్ నుంచి విడిపించుకొని కారు ఎక్కి వెళుతుండగా శ్రీనివాసరావు అడ్డుగా నిలుచున్నాడు. అయినప్పటికీ అతడిని రాసుకుంటూ కారులో వేగంగా వెళ్లిపోయాడు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు తాలూకా పోలీసులు అర్ధరాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసులకు ఎమ్మెల్యే జనార్దన్ ఫోన్...

కానిస్టేబుల్ మీద దాడి చేసిన రాంబాబు పై కేసు పెట్టవద్దంటూ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ తాలూకా పోలీసులకు ఫోన్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం రాంబాబు పరారీలో ఉన్నాడు. ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి వున్నట్లు పోలీసులు చెబుతున్నారు.

రియల్ ట్రబుల్..!



స్థిరాస్తి రంగంలో స్తబ్దత నెలకొంది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లా వ్యాప్తంగా ఆస్తుల క్రయ, విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. దీంతో రిజిస్ట్రేషన్లు మందగించాయి. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ మధ్య జరిగిన వాటితో పోల్చుకుంటే డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు భారీగా తగ్గాయి. ఫలితంగా రూ.32 కోట్ల మేర ఆదాయం పడిపోయింది.

- కూటమి ప్రభుత్వం వచ్చాక కుప్పకూలిన రియల్ ఎస్టేట్ వ్యాపారం
- గత ఏడాది 69,508 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌తో రూ.213 కోట్ల ఆదాయం
- ఈ ఏడాది 34,075 డాక్యుమెంట్లకు పరిమితమై రూ.181 కోట్లకు తగ్గుదల
- దాదాపు రూ.32 కోట్లు తగ్గిన ఆదాయం
- అమరావతిలో స్థలాలు కొనిపించిన టీడీపీ నేతలు
- కృష్ణా వరదల ప్రభావంతో పడిపోయిన వ్యాపారం
- ఆందోళనలో కొనుగోలుదారులు

చీమకుర్తి: కూటమి ప్రభుత్వం కొలువుదీరింది..రియల్ ఎస్టేట్ వ్యాపారం కుప్పకూలింది. చంద్రబాబు అధికారంలోకి వస్తే రియల్ ఎస్టేట్ ద్వారా లాభాలు గడించవచ్చనుకున్న టీడీపీ నాయకులకు అడియాశలే మిగిలాయి. నూతన ప్రభుత్వం కొలువు తీరిన వెంటనే అమరావతిలో పెడితే కాయకు కాయ అంటూ ఒక వైపు టీడీపీ నాయకులు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లు ఊదరగొట్టారు. వీరి మాటలు నమ్మి చీమకుర్తి, సంతనూతలపాడు, ఒంగోలు పరిసర ప్రాంతాలకు చెందిన అనేక మంది కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టి అమరావతి పరిసరాల్లో పొలాలు, ప్లాట్లు కొనుగోలు చేశారు. దీంతో జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పడిపోయింది. అనుకోకుండా విజయవాడలోని వరదలు ఒక్కసారిగా ముంచెత్తటంతో విజయవాడ, అమరావతి చుట్టుపక్కల రియల్ ఎస్టేట్ వ్యాపారంలో పెట్టుబడులు పెట్టిన వారు తమ ప్లాట్లు ఎక్కడున్నాయో కూడా చివరకు డ్రోన్ కెమెరాల ద్వారా చూసుకున్నా కూడా కనిపించే పరిస్థితి లేదని ఆందోళన చెందారు. అమరావతిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చతికిలపడిందని గ్రహించే లోపే పెట్టిన పెట్టుబడుల్లో సగానికి సగం కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు. అమరావతి ప్రభావం జిల్లాలోని రియల్ ఎస్టేట్ రంగంపై తీవ్రంగానే చూపింది. జిల్లాలోని రిజిస్ట్రార్ కార్యాలయంలో నమోదైన రిజిస్ట్రేషన్‌ల గణాంకాలు పరిశీలిస్తే ఎంతగా ప్రభావం చూపిందో తెలుస్తుంది. గత ఏడాది 2023 ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు 69,508 డాక్యుమెంట్లతో రిజిస్ట్రేషన్‌లు జరిగి రూ.213.63 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి వచ్చింది. అదే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పోయిన నెల అక్టోబర్ వరకు రిజిస్ట్రేషన్‌లు 34,075 డాక్యుమెంట్లకు తగ్గింది. ఆదాయం కూడా రూ.181.51 కోట్లకు పడిపోయింది. అంటే దాదాపు 11 వేల డాక్యుమెంట్లు తగ్గటంతో రూ.32 కోట్ల ఆదాయం పడిపోయింది. జిల్లాలో ఒంగోలు, మార్కాపురం, కంభం, గిద్దలూరు, పొదిలి, యర్రగొండపాలెం, కనిగిరి, సంతనూతలపాడు, చీమకుర్తి, దర్శి, సింగరాయకొండ, అమ్మనబ్రోలు తదితర ప్రాంతాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. వీటిల్లో రోజుకు 250 నుంచి 300 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. సగటున జిల్లా కేంద్రం ఒంగోలులో ఉన్న జాయింట్-1, జాయింట్-2 సబ్ రిజిస్ట్రార్ల పరిధిలో రోజుకు 50 నుంచి 60 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్లు చేస్తుంటారు. మార్కాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో సగటున రోజుకు 25, కంభంలో 15, గిద్దలూరులో 15, పొదిలిలో 15, యర్రగొండపాలెంలో 10, కనిగిరిలో 50 నుంచి 60, సంతనూతలపాడులో 15, చీమకుర్తిలో 15, దర్శిలో సుమారు 30 రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం మూడు ప్లాట్లు, ఆరు రిజిస్ట్రేషన్లుగా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్లాట్లు అడిగే వారు లేరని వాపోతున్నారు. ఈ వ్యాపారంలో పెట్టిన పెట్టుబడులు ఎప్పటికి వస్తాయోనని వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

ముఖం చాటేస్తున్న మధ్యవర్తులు

ప్లాట్లు కొనేటప్పుడు మాత్రం ఈశాన్యం బిట్టు, తూర్పు వాస్తు, 30-40 అడుగుల వెడల్పు రోడ్లు, పక్కనే కల్యాణ మండపం, సినిమా థియేటర్లు కడతారంట అంటూ లేని పోని ఊహలు కల్పించి ప్లాట్లను మీడియేటర్లు కొనిపించారు. అంతటితో పోకుండా ఈ వెంచర్‌లో పేరున్న కంపెనీ వారు విల్లాలను కూడా నిర్మిస్తున్నారంటా అంటూ శంకుస్థాపనలు కూడా చేసినట్లు ఫ్లెక్సీలు, శంకుస్థాపనల గుంతలను తవ్వి ప్లాట్ల అమ్మకాలకు తెర తీశారు. తీరా ప్లాట్లను అమ్ముకొని పోయిన తర్వాత ప్రభుత్వం మారిన తర్వాత రియల్ ఎస్టేట్ కుప్పకూలిందని తెలుసుకునే లోపు వారికి ప్లాట్లను అమ్మించిన మీడియేటర్లు కనిపించకుండా ముఖం చాటేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

బ్యాంక్‌లలో వేస్తే వడ్డీ తక్కువ, వడ్డీకి ఇస్తే వడ్డీ తర్వాత సంగతి అసలు కూడా రావడం లేదని పొలాలు, ప్లాట్లపై పెట్టుబడి పెడితే చివరకు రియల్ ఎస్టేట్ వ్యాపారం కూడా నూతన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పడిపోవడంతో కొనుగోలు చేసిన ప్లాట్లు అమ్ముడు పోతాయో లేదోనని మనసంతా హద్దురాళ్ల చుట్టే ప్రదక్షిణలు చేస్తుందని జనం వాపోతున్నారు. పేరుకు ఇంట్లో ఉన్నారనే గానీ రోజుకు ఒకటి రెండు సార్లు ప్లాట్ల వైపు తొంగిచూసి ఏమైనా అడిగే వారున్నారా...? అంటూ పెట్టిన పెట్టుబడికి వడ్డీ కాదుగదా... అసలులో సగమైనా వస్తుందా..? అని పెట్టుబడి పెట్టిన వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు.

> **ఈ ఏడాది రూ.181 కోట్ల ఆదాయం వచ్చింది**
>
> జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది రిజిస్ట్రేషన్ల ద్వారా రూ.181.51 కోట్ల ఆదాయం వచ్చింది. రిజిస్ట్రేషన్‌లు 34,075 డాక్యుమెంట్లు జరిగాయి. అదే గత ఏడాది 69,508 డాక్యుమెంట్ల ద్వారా రూ.213.63 కోట్ల ఆదాయం వచ్చింది. దాదాపు 11 వేల డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్ తగ్గి రూ.32 కోట్ల ఆదాయం పడిపోయింది.
>
> – బాలాంజనేయులు, జిల్లా రిజిస్ట్రార్, ఒంగోలు



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రవిబాబు, పక్కన పార్టీ నాయకులు

ప్రజా సమస్యలపై నిరంతర పోరు

- కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా అండగా ఉంటాం
- పార్టీ కోసం పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఇస్తాం
- టీడీపీ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి
- ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త చుండూరి రవి

ఒంగోలు టౌన్: కార్యకర్తలు, నాయకులందరూ సమష్టిగా ఉంటూ ప్రజా సమస్యలపై ఐక్యంగా గళమెత్తి పోరాడుదామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరి రవి పిలుపునిచ్చారు. కార్యకర్తలు, నాయకులకు ఎలాంటి ఇబ్బంది వచ్చినా కలిసి నిలబడి కలబడదామన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు, జిల్లా, రాష్ట్ర నాయకులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలో ఉన్న తెలుగుదేశం, జనసేన పార్టీల కూటమి ఫేక్ అకౌంట్లను క్రియేట్ చేసి వైఎస్సార్ సీపీ కార్యకర్తల మీద తప్పుడు ఆరోపణలతో కేసులు పెట్టి వేధిస్తోందని, అరెస్టులు చేసి బెదిరింపులకు దిగుతోందని తెలిపారు. గత ఎన్నికల్లో అలవికాని హామీలిచ్చి అమలు చేయలేక చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వ పాలకులు తమ తప్పులను ఎత్తిచూపకుండా సోషల్ మీడియా పేరుతో బెదిరింపులకు దిగుతున్నారని విమర్శించారు. అధికారం ఉంది కదాని వైఎస్సార్ సీపీ కార్యకర్తల జోలికి వస్తే సహించేది లేదన్నారు. కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. ఇలాంటి బెదిరింపులను కార్యకర్తలు, నాయకులు సమష్టిగా ఎదుర్కొంటామని చెప్పారు. ప్రతి ఒక్క కార్యకర్తను కాపాడుకుంటామన్నారు. రాష్ట్ర ప్రజలు కూటమి పాలనపై ఐదు నెలలకే విసిగి పోయారని, రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీ విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఒంగోలు నియోజకవర్గంలో గెలిచి పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు. పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను ప్రతి ఒక్కరికి తగిన గుర్తింపు ఇస్తామని, భవిష్యత్తులో పార్టీ కార్యకర్తలకు పూర్తిగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. హైదరాబాద్ వెళ్లి నెలకోసారి వచ్చి పోయే నాయకుడిని కాదని, ప్రతి రోజూ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని చెప్పారు. కార్యకర్త స్థాయి నుంచి వచ్చాను, కార్యకర్తల కష్టాలు తెలుసని అన్నారు. జగనన్న ఇచ్చిన అవకాశానికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. సంక్షోభ సమయంలో పార్టీ అప్పగించిన బాధ్యతలు తీసుకున్న చుండూరి రవి నాయకత్వంలో పనిచేయడం సంతోషంగా ఉందని లిడ్‌క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ అన్నారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందని ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్ కుప్పం ప్రసాద్ చెప్పారు. అధికార పార్టీ ఇబ్బందులు పెడుతుందని తెలిసి కూడా పార్టీని వీడకుండా పనిచేస్తున్న కార్యకర్తలు, నాయకులను పార్టీ గుర్తుపెట్టుకుంటుందన్నారు.

పార్టీని వీడే ప్రసక్తి లేదు: కార్పొరేటర్లు

ఎవరెన్ని ప్రలోభాలకు గురి చేసినా, ఎన్ని బెదిరింపులకు పాల్పడినా వైఎస్సార్ సీపీని వీడే ప్రసక్తి లేదని కార్పొరేటర్లు స్పష్టం చేశారు. నగర పాలక సంస్థ ఫ్లోర్ లీడర్ పఠాన్ ఇమ్రాన్ ఖాన్ మాట్లాడుతూ గెలుపోటములు సహజమని, పార్టీని బలోపేతం చేసుకొని ఒంగోలు నియోజకవర్గంలో విజయపతాకాన్ని ఎగరేస్తామని చెప్పారు. చుండూరి రవి నాయకత్వంలో ప్రజా సమస్యలపై పోరాడేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. కో ఆప్షన్ మెంబర్ శ్యాం సాగర్ మాట్లాడుతూ..ఇప్పుడు ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే చూస్తున్నారని చెప్పారు. చంద్రబాబు అసమర్థ పాలనపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని షేక్ నాగూర్ అన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలను బెదిరించేందుకు అధికార టీడీపీ ప్రయత్నిస్తుందని, టీడీపీ దోపిడీని ప్రజల ముందు పెడదామని బీసీ సెల్ నాయకుడు బొట్ల సుబ్బారావు చెప్పారు. సమావేశంలో కార్పొరేటర్ ప్రవీణ్, వెంకట మహాలక్ష్మి, తేళ్ల విక్టర్ పాల్, నరసింహ గౌడ్, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, కో ఆప్షన్ మెంబర్ షేక్ రషీదా, దామరాజు క్రాంతి కుమార్, కరుణాకర్, అంజిరెడ్డి, కటారి ప్రసాద్, నరాల రమణారెడ్డి, షేక్ మీరావలి, భూమిరెడ్డి రవణమ్మ, పిగిలి శ్రీనివాసరావు, మధు, పిగిలి శ్రీనివాసరావు, డేవిడ్, శ్రీనివాసరెడ్డి, రాము, చావలి శివ, రొండా అంజిరెడ్డి, ఫణిదపు సుధాకర్, నాయకులు పాల్గొన్నారు.

కూటమి సైకోలపై చర్యలు తీసుకోవాలి

- వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి
- ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు



ఒంగోలు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న చుండూరి రవి, కాకుమాను రాజశేఖర్, కుప్పం ప్రసాద్, కఠారి శంకర్, నాయకులు

ఒంగోలు టౌన్: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై, ఆయన కుటుంబ సభ్యులపై టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన సైకోలు సోషల్ మీడియాలో పెట్టిన పోస్టులపై చర్యలు తీసుకోవాలని, వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం ఒంగోలు వన్‌టౌన్ పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశారు. వైఎస్సార్ సీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి, లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, నగర అధ్యక్షుడు కఠారి శంకర్ నాయకత్వంలో పెద్ద సంఖ్యలో నాయకులు వన్‌టౌన్ పోలీసు స్టేషన్ చేరుకున్నారు. ఫిర్యాదు చేసిన అనంతరం మీడియాతో చుండూరి రవి మాట్లాడుతూ సభ్య సమాజం తలదించుకునేలా కూటమి నాయకులు, కార్యకర్తలు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విష సంస్కృతి టీడీపీదేనని, 2014 నుంచి వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద నీచంగా పోస్టులు పెట్టిస్తున్నారని తెలిపారు. షర్మిలమ్మ, విజయమ్మల మీద ఐ టీడీపీ నుంచే అసభ్యంగా పోస్టులు పెట్టించారన్నారు. 2019లో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింహాసనం మీద శునకం కూర్చుందని పోస్టులు పెట్టించారన్నారు. ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నీతులు చెబుతున్నారని, జగన్ కుటుంబ సభ్యుల మీద పెట్టిన పోస్టుల మీద నోరు మెదపడంలేదని అన్నారు. వైఎస్సార్ సీపీ తరఫున ఇచ్చిన ఫిర్యాదులపై కూడా విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ మంత్రులు, చివరకు మాజీ మహిళా మంత్రుల మీద కూడా అసభ్యంగా పోస్టులు పెడుతున్నారని, వారిపై ఫిర్యాదు చేస్తున్నామని లిడ్ క్యాప్ మాజీ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ తెలిపారు. మహిళల ఆత్మగౌరవం గురించి మాట్లాడే పవన్ కళ్యాణ్ ఇప్పుడెందుకు నోరు తెరవడం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోజు రోజుకు మహిళలపై లైంగికదాడులు పెరిగిపోతున్నాయని, మద్యం మత్తులో మహిళలు, బాలికలను కూడా వదిలిపెట్టకుండా లైంగికదాడులకు పాల్పడుతుంటే ఎలాంటి చర్యలు తీసుకోకుండా సోషల్ మీడియా పేరుతో కూటమి పాలకులు వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకుల మీద కేసులు పెట్టడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కుప్పం ప్రసాద్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినాయకుడు జగన్ మీద, వారి కుటుంబ సభ్యుల మీద అసభ్యకరమైన పోస్టులు పెట్టిన కూటమి పార్టీల సోషల్ మీడియా సభ్యుల మీద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఒంగోలు నగరపాలక సంస్థ ఫ్లోర్ లీడర్ ఇమ్రాన్‌ఖాన్, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవాదులు ఎస్.శ్రీనివాసరావు, కె.సంపత్ కుమార్, కె.శేషారెడ్డి, డి.హరిబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్లపై మాటమార్చిన డోల..

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: గ్రామ వలంటీర్ వ్యవస్థపై రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఇప్పటి వరకు రోజుకో మాట చెబుతూ వస్తున్నారు. వలంటీరు వ్యవస్థను రద్దు చేయం అంటూ చెప్పుకొచ్చిన మంత్రి తాజాగా మాట మార్చేశారు. శాసన మండలి వేదికగా అసలు ఈ వ్యవస్థ ఉండదంటూ ప్రకటన చేయడం సంచలనంగా మారింది.

నాడు అలా..

గతంలో మంత్రిగా స్వామి బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలిసారిగా వల్లూరమ్మ గుడిలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడారు. అలాగే పలు టీవీ చానళ్లకు ఇంటర్వ్యూలు ఇచ్చారు. ''గ్రామ వలంటీర్లను కొనసాగిస్తాం... నా వాట్సప్ మెసేజ్‌లతో నిండిపోయింది. వైఎస్సార్‌సీపీ నాయకులు బలవంతంగా వలంటీర్ల చేత రాజీనామా చేయించారు. ప్రస్తుతం ఉన్న వలంటీర్లతో పనిచేయించుకుంటాం. వలంటీర్లకు ఇచ్చిన మాటకు ఎన్‌డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉంది. వలంటీర్ వ్యవస్థ రద్దు చేస్తారనడం అవాస్తవం. ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేయాలని చూస్తే సహించేది లేదు'' అని మంత్రి స్వామి ఆనాడు ఆర్భాటంగా ప్రకటనలు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సైతం ఇదే విధమైన ప్రకటనలు చేశారు కూడా.

నేడు ఇలా..

తాజాగా మంత్రి స్వామి మాట్లాడుతూ వలంటీర్ వ్యవస్థ అనేది ఉంటే కొనసాగించేవాళ్లం. లేని వ్యవస్థను ఎలా కొనసాగిస్తాం. పిల్లాడికి పేరు పెట్టలేదు అంటే లేని పిల్లాడికి పేరు ఎలా పెట్టాలి అన్నట్లుంది వలంటీర్ వ్యవస్థ తీరు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2023 ఆగస్టు వరకు వలంటీర్ వ్యవస్థ ఉన్నట్లు జీఓ ఇచ్చింది. తరువాత వలంటీర్ వ్యవస్థ ఉన్నట్లు జీఓ ఇవ్వలేదు. అని శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అడిగిన ఓ ప్రశ్నకు మంత్రి స్వామి సమాధానమిచ్చారు.

అనుకున్నదే జరిగింది

గ్రామ వలంటీర్ వ్యవస్థపై కూటమి ప్రభుత్వం కక్షపూరిత ధోరణితోనే ఉందని కొండపి నియోజకవర్గ వలంటీర్ల సంఘం అధ్యక్షుడు పిల్లిపోగు జీవన్‌కుమార్ అన్నారు. ఎన్నికల సమయంలో రూ.10 వేల జీతం ఇస్తామని చంద్రబాబు దగ్గర నుంచి అందరూ మాయమాటలు చెప్పారని, గెలిచిన తరువాత కూడా పలువురు మంత్రులు వలంటీర్లను కొనసాగిస్తాం అంటూ ప్రకటనలు చేస్తూ వచ్చారన్నారు.. మంత్రి డోల ఒక అడుగు ముందుకేసి జిల్లాలో, రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తామంటూ ప్రకటనలు చేశారని తెలిపారు. ఇప్పుడేమో జీఓ లేదు... వలంటీర్ వ్యవస్థ లేదు.. లేని బిడ్డకు పేరు ఎలా పెడతాం అని డొంక తిరుగుడు మాటలు చెబుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వలంటీర్ వ్యవస్థ కొనసాగిస్తున్నట్లు జీఓ జారీ చేయవచ్చుగదా అని అన్నారు.

అన్ని రంగాల్లో జిల్లా బిడ్డలు ప్రకాశించాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



ర్యాలీ ని జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టరు తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ప్రపంచ యవనికపై అన్ని రంగాల్లో ప్రకాశం జిల్లా బిడ్డలు ప్రకాశించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అన్నారు. పి.వి.ఆర్ బాలుర హైస్కూల్‌లో బుధవారం వారం రోజుల నుంచి నిర్వహిస్తున్న బంగారు బాల్యం ముగింపు సభ నిర్వహించారు. బంగారు బాల్యం బాలోత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకొని ఒంగోలులోని ఓల్డ్ గుంటూరు రోడ్డులో రవిప్రియా మాల్ వద్ద నుంచి పి.వి.ఆర్ బాలుర ఉన్నత పాఠశాల వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ ఆడబిడ్డ కనీసం డిగ్రీ చదవాలని, జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. బాలలపై నేరాలు జరగకుండా, బాలకార్మికులుగా మారకుండా చూడాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా జిల్లా పిల్లలు తమకంటూ ప్రత్యేకమైన గుర్తింపు సాధించాలనేది తన కలన్నారు. బాల్యం తీపి గుర్తుగా ఉండాలే తప్ప గతాన్ని జ్ఞాపకం చేసుకుంటే ఏ బిడ్డా నిరుత్సాహపడే పరిస్థితి రాకూడదన్నారు. బాల్య వివాహ రహిత, బాలకార్మిక రహిత, ఆరోగ్యకర, అక్షర చైతన్యవంతమైన ప్రకాశం జిల్లా ఆవిష్కృతమే లక్ష్యంగా బంగారు బాల్యం కార్యక్రమాన్ని రూపొందించామన్నారు. ఈ ప్రయత్నంలో ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ లీడర్లను కూడా భాగస్వాములను చేసి సమన్వయంతో ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. ఎస్పీ దామోదర్ మాట్లాడుతూ బంగారు బాల్యానికి తల్లిదండ్రుల ప్రేమ, ఉపాధ్యాయుల శ్రద్ధ, మంచి స్నేహితుల సాంగత్యం, పోలీసుశాఖ వంటి రక్షణ వ్యవస్థలు ముఖ్యమన్నారు.

ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలంటే ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నారు. ఈ నెల 14 నుంచి వారం రోజుల పాటు బంగారు బాల్యం బాలోత్సవాల కార్యక్రమాల గురించి వివరించారు. అనంతరం మండల, డివిజన్, జిల్లా స్థాయిలో బంగారు బాల్యం బాలోత్సవాల సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, లోగో, స్లోగన్స్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, డీఈవో అత్తోట కిరణ్‌కుమార్, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీ ప్రసన్న, ఐసీడీఎస్ పీడీ కె.మాధురి, సార్ప్ ప్రతినిధి సునీల్, డీఆర్డీఏ పీడీ వసుంధర, మెప్మా పీడీ రవికుమార్, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.